
# చిత్రప్రభ

"నీవు బాగా నటించు—నటించకపో. ఉన్నంతవరకూ నీ నటన వాస్తవికంగానూ, సహజంగానూ ఉండాలి" అన్నాడొక ప్రసిద్ధ కళాకారుడు. అక్షర లక్షల విలువైన మాట. నిజమే. కాని దాన్ని సాధించడం ఎలా?

నటీ నటులకు ఈ విశాల విశ్వమే ఒక పాఠశాల. నటుడు తన నిజజీవితంలో జరిగే అనేక సంఘటనలనూ, అనుభవంలోనికి వచ్చే వివిధ సందర్భాలనూ, తటస్థపడే వింతప్రవృత్తులనూ, తారసిల్లే రకరకాల వ్యక్తులనూ ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటినుండి అనేక పాఠాలను నేర్చుకోవాలి! ఆయా సంఘటనల తాలూకు అనుభూతులను మనోపుటంలో పదిలంగా భద్రపరచుకోవాలి!! అంతేగాదు. సృజనాత్మక శక్తిగల నటుడు ఎన్నడూ తన అనుభవంలోనికి రాని సంఘటనలు కూడా ఊహాశక్తితో అనుభూతికి తెచ్చుకొని వాటిని ప్రదర్శించ గలిగి ఉండాలి!

ఇక నటుడు ఒక పాత్రను నటిస్తూ ఉన్నప్పుడు లోగడ తన జీవితంలో అనుభవించి



## సినిమాల్లో నటన - వాస్తవికత

*ఏది సత్యం? ఏదసత్యం? ఏది నిజం? ఏది నటన? ఎవరూ విడమరిచి చెప్పలేరీ ప్రశ్నకు సమాధానం. మానవ జీవితం శాశ్వతం కాదు. నిత్యం కానిది నిజంకాదు. అనుభావ్యమే అయినా అసత్యం. నటించని వారు లేరీ జగతిలో. యథార్థాన్ని కల్లగాను, కల్ల యథార్థంగాను ప్రదర్శించి ఒప్పించగల సామర్థ్యం అందరికీ అలవడేదీ కాదు. మరి ఇది ఎలా సాధ్యం? అని ప్రశ్నించేవారికి ఈ సుప్రసిద్ధ సినీనటుని భావాలూ అనుభవాలూ ఒక సమాధానం.*

జాగ్రత్తగా దాచుకున్న అనుభూతులను వెలికి తీసి సందర్భానుసారంగా ఆ పాత్రకు జోడించి, ఆ పాత్రయొక్క స్వరూప స్వభావాలకు అన్వయించి సజీవంగా, కళాత్మకంగా సాక్షాత్కరింపజేసి ప్రేక్షకులకు రసానుభూతిని కలిగించాలి.

అయితే, మరి నటుని నటన ఇంత వాస్తవికంగాను, సహజంగాను ఉండాలంటే, ప్రేక్షకులకు రసానుభూతిని కలుగజేసి వారిని తన్మయులను చేయాలంటే నటుడు తాను నిర్వహించే పాత్రలో పూర్తిగా లీనమై, తాదాత్మ్యం చెంది నటించాలా?

యథార్థానికి సినిమానటనకూ వాస్తవికతకూ ఒక విధంగా చుక్కెదురు! 'స్టేజి' పైన అయితే ఒక క్రమపద్ధతిలో నడిచే కథాగమనం వల్ల, రంగంలో తనకు సహాయకారులుగా ఉండే ఇతర నటీనటులవల్ల, ఎప్పటికప్పుడు ప్రోత్సాహాన్నిచ్చే ప్రేక్షకులవల్ల నటుడు కొన్ని సందర్భాలలో అయినా సహజంగా రసానుభూతిని పొంది, భావావేశాన్ని ప్రకటించి ప్రేక్షకులను తన్మయుపరచగలడు! కాని సినిమాలలోని పద్ధతి అందుకు పూర్తిగా విరుద్ధం!

కృత్రిమ విధానాలు ఎక్కువ. దృశ్యంలోని తోటి నటీనటులు అన్నివేళలా ఉండరు! ప్రేక్షకులు అసలే ఉండరు! దృశ్యాన్ని ముక్కలు ముక్కలుగా చిత్రీకరిస్తారు. కథను వరుసగా ఒక క్రమపద్ధతిలో తీయరు. ఒకే రసస్థాయిగల ఒక దృశ్యం పూర్తిగావటానికి అనేక రోజులూ వారాలూ, నెలలూ పట్టవచ్చు! అంతేకాదు. ఒక్కొక్కప్పుడు ఒకే రకమైన భావప్రకటనను నటుడు వరుసగా అనేకసార్లు నటించవలసి వస్తుంది! ఇక వివిధరకాల భావప్రకటనలో నటుని ముఖ కవళికలు, అంగవిన్యాసం ఏ మాత్రం ఎబ్బెట్టుగా ఉన్నా, అసహజంగా ఉన్నా, మామూలుగా కంటికి కనిపించని ఈ చిన్న చిన్న లోపాలు "కెమెరా"లో గోరంతలు కొండంతలుగా కనిపించే ప్రమాదంకూడా ఉంది! అందువల్ల సినిమా నటన ఒకవిధంగా కత్తిమీద సామువంటిది!

ఈ యంత్రాలమధ్య, ఇన్ని కృత్రిమాలతో కూడుకున్న ఈ అసహజవాతావరణంలో కూడ నటుని నటన నిత్యనూతనంగానూ, వాస్తవికంగానూ, రసాత్మకంగానూ ఉండాలంటే దానికెంతో సాధన కావాలి. కృషిచేయాలి. తన తప్పులను తాను తెలుసుకో కలిగి ఉండాలి. ఇతరుల విమర్శలను సహృదయంతో అర్థం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు క్రొత్తవిషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి ఆకాంక్ష పెంపొందించుకోవాలి!! అనుభవజ్ఞులయిన దర్శకుల సలహాలను పాటించాలి!!! నటుడు ప్రతిరోజూ "సెట్" మీదికి రాగానే అంతవరకూ చిత్రీకరింపబడిన తన పాత్రను మొత్తంగా ఒకసారి మననం చేసుకోవాలి. ఏ దృశ్యంలో తన నటన ఎంతస్థాయిలో ఉందో గుర్తుకు తెచ్చుకోవాలి. ముందు జరుగబోయే ఘట్టాలలో ఏవిధంగా రూపొందబోతూందో స్థూలంగా అంచనా వేసుకోవాలి. కథాగమనంలో ఏదృశ్యం తరువాత ఆనాటి సంఘటన వస్తుందో, వెనుకముందు సందర్భాలు ఏమిటో క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు నటనా విధానంలో తన భావాలనూ, దర్శకుని అభిప్రాయాలనూ సమన్వయించుకొని ఒక స్థిర

మైన నిర్ణయంతో నటుడు ఆయా పాత్రలను నిర్వహించాలి !

ఆ తరువాత నా అనుభవంలో నేను గ్రహించిన మరొక ముఖ్య విషయం—ప్రతి 'షాట్' 'టేక్' చేయబోయేముందు అనేకసార్లు 'రిహార్సల్సు' చేయటం జరుగుతుంది. ఈ రిహార్సల్సులోనే నటుడు పూర్తి భావావేశాన్ని ప్రకటించకూడదు. మనస్సును లగ్నంచేసి, కావలసిన భావావేశాన్ని 'టేక్'లో మాత్రమే ప్రదర్శించాలి. ఏమంటే ఎంతగొప్ప నటుడైనా పూర్తిభావావేశాన్ని ఒకే విధంగా వరుసగా అనేకసార్లు ప్రదర్శించలేడు. అటువంటి సందర్భాలలో నటన యాంత్రికంగా తయారయ్యే ప్రమాదం ఉంది ! నటుడు ముఖ్యంగా ఈ ప్రమాదాన్నుంచి తప్పించుకోవాలి !

ఇంతకుమించిన మరొక ప్రమాదమేమంటే, నటుడు ఏకాగ్రతతో మనస్సునులగ్నంచేయటంలో పాత్ర తాలూకు సంఘర్షణలను తనస్వంతం చేసుకొని [illegible]టించడంలో తన చట్టూ ఉన్న పరిసరాలను [illegible] ఘంట్రాలనూ ఏమాత్రం విస్మరించకూడదు. అంతేకాదు; 'కెమెరామన్' పెట్టిన హద్దులను గుర్తుపెట్టుకొని 'రికార్డిస్టు' చెప్పిన సంభాషణ స్థాయిలను మననం చేసుకొంటూ, దర్శకులు ఇచ్చిన సలహాలను పాటిస్తూ నటుడు తనపాత్రలో లీనంకాకుండానే లీనం అయినట్లుగా ప్రేక్షకులకు స్ఫురింపజేయాలి ! తనచుట్టూ ఉన్న ఈ వాతావరణం అంతా గమనిస్తూనే, గమనించకుండా నటిస్తున్నాడనే భ్రమను ప్రేక్షకులకు కలుగజేయాలి !! ఈ రసానుభూతిలో తాదాత్మ్యం చెందకుండానే చెందినట్లుగా ప్రేక్షకులను నమ్మించాలి ! ! !

ఇవి కేవలం సిద్ధాంతాలను చదువుకున్నంత మాత్రంతో లభ్యం అయ్యేవి కావు. ఆచరణలో ఈ సాధకబాధకాలను అనుభవించి, తన తప్పులను తాను తెలుసుకుంటూ అభ్యాసంతో నటుడు క్రమంగా అలవరచుకోవలసినవి ! పట్టుదలతో కృషితో సాధించవలసినవి ! ! దీనికెంతో ఏకాగ్రత అవసరం. వీటన్నిటివీ మించినవి—పుట్టుకతోనే కళాకారున కుండవలసిన రహస్య హృదయం ! ఊహాశక్తి ! ! మేధాసంపత్తి ! !! ధారణాపటిమ ! ! ! !

ఈ ఏకాగ్రతను ప్రదర్శించడంలో, రసానుభూతిని పొంది దృశ్యానికి వాస్తవికతను రూపొందించడంలో, మరొక పాత్రగా జీవించడంలో నటుడు తన స్వంత ప్రకృతినీ, పరిసరాలనూ, తను నటిస్తున్నానన్న యథార్థాన్నీ ఏమాత్రం విస్మరించినా ప్రేక్షకులకు రసానుభూతికి బదులుగా ఆ దృశ్యమే రసాభాసం కావడం జరుగుతుంది !

"ఇలాగే తన్మయత్వానికి లోనై, తాను, నటిస్తున్నాననే సత్యాన్ని విస్మరించిన నటుడు, 'భక్తప్రహ్లాద'లో తను నిజంగా 'నరసింహావతారం' అనుకొని హిరణ్యకశ్యప పాత్రధారిని నిజంగానే చంపివేశాడు"— అనేది కట్టుకథ అయినా నా నటనాజీవితంలో జరిగిన ఒక సంఘటన చెప్తాను—

'బాలసన్యాసమ్మ కథ' షూటింగు జరుగుతున్నరోజులు. అందులో మేమిద్దరం అన్నదమ్ములం. నేను పెద్దవాడిని. చిన్నవాడైన నా సోదరుడు చనిపోయిన ఘట్టం ఆరోజు చిత్రీకరిస్తున్నారు. చనిపోయిన నాతమ్ముని శిరస్సు నాతొడమీదికి చేర్చుకొని కంట నీరు పెట్టుకుంటూ చెప్పే కొన్నిమాటలను తీస్తున్నారు. ఆ 'షాట్' ను 'టేక్' చేయటానికి ముందు ఈ దృశ్యానికి దగ్గరగా ఉన్న నా నిజజీవితంలోని సంఘటనను ఒకదాన్ని గుర్తుకు తెచ్చుకున్నాను.

అప్పటికి ఆరుసంవత్సరాల క్రితం, సినిమా రంగంలో ప్రవేశించకముందు, నేను ప్రాణాధికంగా ప్రేమించే నా సోదరుడు పెదతల్లి కుమారుడు నాచేతులలో ఆఖరి శ్వాసను విడిచాడు. తల్లితండ్రులకు ఒక్కడే కొడుకు. అప్పటికి వివాహమై సరిగ్గా సంవత్సరమైంది. ఆ నూతన దంపతుల మధ్య సిగ్గు తెరలు కూడ ఇంకా పూర్తిగా తొలగిపోలేదు ! అందరూ చుట్టూ ఉండి చూస్తూనే ఉన్నారు. అతని ప్రాణవాయువులు అనంత విశ్వంలో కలిసిపోయాయి.

ఆనాటి ఆ హృదయవిదారక దృశ్యం ఒక్కసారి నాకన్నుల ఎదుట కదిలింది. కాలపురుషుని కమ్మని హస్తాలతో జోకొట్టబడి, నిద్రబుచ్చబడిన ఆనాటి నా ఆవేదన ఒక్కసారి మేల్కొని నా మనోవీధిలో సాక్షాత్కరించింది. అంతే...... ఎదురుగా ఉన్న 'కెమెరా', నా మాటలను రికార్డు చేయటానికి పైన ఉన్న 'మైక్', నటనలోని బాగోగులు నిర్ణయించి సలహాలు ఇవ్వడానికి వేయికళ్లతో చూస్తూ ఉన్న దర్శకుడు— అందరూ నా దృష్టిపథంనుంచి దూరమైపోయారు. నా స్వరపేటిక మూసుకు పోయింది. నేనెవరో ఎందుకు అక్కడ ఉన్నానో సర్వం మరిచిపోయాను. చెప్పవలసిన మాటలకు బదులు పూడుకుపోయిన నాగొంతుకలోనుండి కట్టలు త్రెంచుకున్న శోకం మాత్రమే బయటికి



విజయావారి

'జగదేక వీరుడు'లో రాజనాల

వచ్చింది. అలా కొన్ని నిమిషాలు ఏడుస్తూనే ఉన్నాను. చుట్టూ ఉన్నవారు ఇది గ్రహించి నన్ను దూరంగా తీసుకొని వెళ్ళారు. పదినిమిషాల తరువాతగాని మళ్లా నేను మామూలు మనిషిని కాలేకపోయాను. అరగంట తరువాత గాని మరల కావలసిన విధంగా నటించలేకపోయాను. ఈ అతివాస్తవిక నటన 'కెమెరా'లో రాలేదు. కావలసిన మాటలు 'మైక్'కు అందలేదు. అంతా నిష్ఫలమైపోయింది !! మితి తప్పిన నా యీ భావావేశం ఎందుకూ పనికి రాకుండా పోయింది ! !

అందువల్ల సినిమాలలో నటీనటులు పాత్రలలో పూర్తిగా లీనం కాకుండానే అయినట్లు ప్రేక్షకులకు స్ఫురింపచేయాలి ! కృత్రిమాలలోనే వాస్తవికాన్ని, అసహజాలతోనే సహజత్వాన్ని సృష్టించుకోవాలి ! ! రసానుభూతితో తాదాత్మ్యం చెందకుండానే చెందినట్లుగా భ్రమింపచేయాలి ! ! !

గుమ్మడి వెంకటేశ్వరరావు

★